

బిల్లులోని లోపాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ, పార్థసారథి తదితరులు

సవరణ బిల్లులోని అంశాలను వ్యతిరేకిస్తున్నాం

- 1961 చట్టాన్ని కొనసాగించాలి
- విదేశీ లాయర్లను అనుమతించవద్దు
- ఆలిండియా లాయర్స్ యూనియన్

రాంనగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన న్యాయవాదుల (సవరణ బిల్లు)లోని పలు అంశాలను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ఆలిండియా లాయర్స్ యూనియన్ పేర్కొంది. 1961 చట్టాన్ని కొనసాగించాలని, విదేశీ లాయర్లను అనుమతించవద్దని అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సత్యనారాయణ, పార్థసారథి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ముసాయిదా బిల్లుపై అభ్యంతరాలు, సలహాలు, సూచనలతో కూడిన పుస్తకాన్ని వారు ఆవిష్కరించి మాట్లాడారు. కొత్త ముసాయిదా బిల్లులోని లోపాలు, కేంద్ర ప్రభుత్వ వైఖరిని వివరించారు. కొత్త సవరణ బిల్లులో న్యాయవాదుల రక్షణ, సంక్షేమ చర్యలు లేవన్నారు. న్యాయవాద వృత్తిని ప్రమాదంలో తీసుకొచ్చే అంశాలు ఉన్నాయని అన్నారు. ఏదైనా మార్పులు చేర్పులు చేయాలంటే న్యాయవాదులతో సంప్రదింపులు చేయాలన్నారు. ఎలాంటి చర్చలు లేకుండానే కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా న్యాయవాద చట్టాన్ని సవరించాలని చూస్తే దేశవ్యాప్త ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కొత్త బిల్లుపై ఇప్పటికే తమ యూనియన్ తరఫున పరిశీలనలు, ప్రతిపాదనలతో కూడిన వినతిపత్రం కేంద్రప్రభుత్వానికి పంపించామన్నారు. కేవలం న్యాయవాద వృత్తిలో ఉన్నవారికి మాత్రమే బార్‌కౌన్సిల్ ప్రాతినిధ్యం వహించాలని పేర్కొన్నారు. ఆయా రాష్ట్రాల బార్ కౌన్సిల్ గానీ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలోకి న్యాయవాదేతరులను కేంద్రం నియమించే ప్రయత్నం అప్రజాస్వామిక చర్య అన్నారు. కొత్త సవరణ చట్టం న్యాయవాదుల ఉనికికే దెబ్బతీసేలా ఉందన్నారు. కొత్త ముసాయిదాలో తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ అనే పేరులేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం బార్ కౌన్సిల్ ఎన్నికలు ప్రజాస్వామ్యపద్ధతిలో జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ నాయకులు రాంచంద్రారెడ్డి, వినోద్‌రెడ్డి, మామిడి వెంకటరెడ్డి, ఎం.శ్రీనివాస్ రావు, మాధవరెడ్డి, వెంకటేష్, వేణుగోపాల్, రమేష్‌కుమార్, శర్మ పాల్గొన్నారు.


రెడ్‌బిల్డింగ్ చౌరస్తా వద్ద బీజేపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న అజయ్‌కుమార్ తదితరులు

దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యం : బీజేపీ

నల్లకుంట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నాయకత్వంలోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఏడెల్లి అజయ్‌కుమార్ అన్నారు. శనివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని పోలింగ్ బూత్ నెంబర్ 41 రెడ్‌బిల్డింగ్ చౌరస్తా వద్ద బీజేపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రాబోయే యువతరాన్ని మేకిన్ ఇండియా వైపు తీసుకెళ్లి రానున్న కొద్ది రోజుల్లో ప్రపంచలోనే మూడో ఆర్థిక వ్యవస్థగా దేశాన్ని తీర్చిదిద్దే రూపకల్పనలో మోదీ పాలన సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇ.ఎస్.ధనుంజయ, కెంచె చంద్రశేఖర్, ఏడెల్లి భాస్కర్, ఏడెల్లి బాలు, వంగూరి సుధాకర్, మహేష్‌రాజు, నర్సింగ్‌రావు, వెంకటేష్, శ్యామ్, కృష్ణ, జె.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ముషీరాబాద్ శివాలయం చౌరస్తా వద్ద కాషాయ జెండాను ఆవిష్కరించిన హిందూవాహిని భోలక్‌పూర్ శాఖ అధ్యక్షుడు బబ్లూ విశ్వేశ్వర్ తదితరులు


హిందూ ధర్మాన్ని కాపాడాలి

ముషీరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మపరిరక్షణ కోసం యువత అంకిత భావంతో పనిచేయాలని హిందూవాహిని భోలక్‌పూర్ శాఖ అధ్యక్షుడు బబ్లూ విశ్వేశ్వర్ అన్నారు. శనివారం ముషీరాబాద్ శివాలయం చౌరస్తా వద్ద హిందూ వాహిని ఆధ్వర్యంలో కాషాయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బబ్లూ విశ్వేశ్వర్ మాట్లాడుతూ... హిందూవులంతా ఐక్యంగా ఉండి మన సంస్కృతి, సంప్రదాయాలన పిల్లలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా హనుమాన్‌చాలీసాను పఠించారు. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని నాయకులు మురళి, సాయి, రవి, వంశీ, శివముదిరాజ్, శ్రీనివాస్‌రావు, సదా తదితరులు పాల్గొన్నారు.

30 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

సీఎం రేవంత్‌రెడ్డికి ఎంపీ ఆర్.కృష్ణయ్య లేఖ

రాంనగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 30 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి శనివారం ఎంపీ ఆర్.కృష్ణయ్య లేఖ రాశారు. ఇందుకు సంబంధించిన వివరాలను బీసీ భవన్‌లో ఆయన విలేకరులకు తెలిపారు. గత సంవత్సరం టీచర్ పోస్టుల భర్తీ కారణంగా మొత్తం పోస్టులను భర్తీ చేయలేదని, దీనివల్ల పెద్దఎత్తున ఖాళీలు ఏర్పడ్డాయని తెలిపారు. ఖాళీల వల్ల విద్యార్థులకు సరైన విద్య అందడం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో 8వేలు, ఎయిడెడ్ పాఠశాలల్లో 5,900, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలల్లో 7వేలు, ఆదర్శ పాఠశాలల్లో 6,500, కస్తూర్బా పాఠశాలలో 2 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిని వెంటనే భర్తీ చేయాలని సీఎంకు రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అరవింద్‌కుమార్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్

రాంనగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ సూచించారు. అభయాంజనేయస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో రూపొందించిన సే నో టూ డ్రగ్స్ వాల్‌పోస్టర్‌ను శనివారం రాంనగర్ చౌరస్తాలో మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించి, మాట్లాడారు. యువత క్రీడలు, విద్యపై ఆసక్తి చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దీక్షిత్‌రెడ్డి, పరకాల మనోజ్‌కుమార్‌గౌడ్, శ్రీదర్‌రెడ్డి, రమేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.


రాంనగర్ బ్రిడ్జి వద్ద గల అభయాంజనేయస్వామి ఆలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే గోపాల్, జైసింహ, శ్రీనివాస్ తదితరులు


గోల్నాక డివిజన్ నింబోలిఅడ్డ హర్రాస్‌పెంటలోని శ్రీహనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే వెంకటేష్ పూజలు


ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో శోభాయాత్ర బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి, ఏసీపీ రమేష్‌కుమార్, సీఐలు

ఘనంగా హనుమజ్జయంతి

- వాడవాడలా అన్నదాన కార్యక్రమాలు
- భారీఎత్తున పోలీసు బలగాల మోహరింపు
- కోలాహలంగా శోభాయాత్ర

హనుమాన్ జయంతిని శనివారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో వైభవంగా నిర్వహించారు. ముషీరాబాద్, భోలక్‌పూర్, బర్కత్‌పుర, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, కాచిగూడ, రాంనగర్, కవాడిగూడ, విద్యానగర్, చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు, గాంధీనగర్, మహాత్మానగర్ తదితర ప్రాంతాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూజలు, శోభాయాత్ర ర్యాలీలు, అన్నదాన కార్యక్రమాలతో వాడవాడలా ఆధ్యాత్మికత వెల్లువిరిసింది. ఈ వేడుకల్లో ఎమ్మెల్యేలు గోపాల్, వెంకటేష్ కార్పొరేటర్లు, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

– రాంనగర్/చిక్కడపల్లి/ముషీరాబాద్/గోల్నాక, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి)


శోభాయాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో వీరహనుమాన్ విజయయాత్ర శనివారం కోలాహలంగా జరిగింది. మధ్యాహ్నం రెండున్నర గంటలకు ఆర్టీసీక్రాస్‌రోడ్‌కు చేరుకున్న విజయయాత్రకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. జైశ్రీరామ్ అంటూ కార్యకర్తలు, ప్రజలు నినాదాలిచ్చారు. చిక్కడపల్లి నుంచి ఆర్టీసీక్రాస్‌రోడ్ నుంచి అశోక్‌నగర్ వరకు సాగిన ర్యాలీలో వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు. ఆర్టీసీక్రాస్‌రోడ్స్‌లో ర్యాలీ సందర్భంగా నిర్వహించిన పలు విన్యాసాలు అనేక మందిని ఆకట్టుకున్నాయి. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ఆర్టీసీక్రాస్‌రోడ్స్ ప్రాంతాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అగ్నిమాపక వాహనాలను రప్పించారు. ఓడియన్ మాల్ ఎదురుగా వైద్యశిబిరం, అంబులెన్స్ ఏర్పాటు చేశారు. పోలీసు పహారా నడుమ ఈ యాత్ర కొనసాగింది. సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి, చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య, నాగరాజు, మౌనిక, అభిలాష్ తదితరులు బందోబస్తును పర్యవేక్షించారు. క్రాస్‌రోడ్స్‌లో నాలుగుదారులు మూసివేసి కేవలం ర్యాలీ వెళ్లడానికి వీలుగా ఏర్పాట్లు చేశారు. తొలుత ర్యాలీ వెళ్లిపోయిన తర్వాత 15 నిముషాలకు కర్మన్‌ఘాట్ నుంచి వచ్చిన భారీ ర్యాలీ కూడా దాదాపు అరగంటపాటు కొనసాగింది. మొత్తంగా ర్యాలీ ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ యాత్ర తాడ్‌బందు అంజనేయస్వామి ఆలయానికి వెళ్లేవరకు పోలీసులు క్రాస్‌రోడ్స్ తదితర సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేశారు.


శోభాయాత్రకు స్వాగతం పలికేందుకు ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌కు వచ్చిన ముస్లింలు


రాంనగర్ రామాలయం వద్ద భక్తులకు అల్పాహారం పంపిణీ


రాంనగర్‌లో హనుమాన్ జయంతి సందర్భంగా మజ్జిగ పంపిణీ చేస్తున్న మహిళలు


క్రాస్‌రోడ్‌లో విస్తృతపోలీసు బందోబస్తు


ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని స్వాగతవేదికపైనుంచి ప్రసంగిస్తున్న రామ్‌నగర్ కార్పొరేటర్ రవిచారి


దోమలగూడ అడ్వకేట్ కాలనీలో వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ రవీందర్

27న బీఆర్ఎస్ రజతోత్సవ సభ

బర్కత్‌పుర, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వేలాదిగా తరలిరావాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈనెల 27న వరంగల్ ఈ ఆవిర్భావ సభ జరగనున్నదని నియోజకవర్గంలోని అయిదు డివిజన్ల నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్తున్నారని తెలిపారు. కాచిగూడ జమల్‌బస్తీలోని ఏకే భవన్‌లో పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కాచిగూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ బద్దుల ఓంప్రకాష్‌యాదవ్, డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ బద్దుల షిరీష, సునీల్ బిడ్లాన్, థాత్రిక్ నాగేందర్ బాబ్జీ, బి.కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ చాలా ముఖ్యం

రాంనగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఉన్నతంగా రాణించాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్ చాలా ముఖ్యమని ఐబీఎం అకాడమిక్ డాక్టర్ లలితా ఆనంద్ పేర్కొన్నారు. ఎంతో మంది విద్యార్థులు ర్యాంకుల కుస్తీలో పడి సమాజంలో ఏమి జరుగుతుందో తెలుసుకోలేకపోతున్నారని అన్నారు. ఇతరులతో అన్ని విషయాలను షేర్‌చేసుకోవాలని, అప్పుడే అన్నింటిపై అవగాహన వస్తుందన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ లా కాలేజీ ప్రాంగణంలో లా విద్యార్థులకు సెల్ఫ్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్ నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజ వివేక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ లలితా ఆనంద్ మాట్లాడారు. ఇంగ్లిష్‌తోపాటు మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డాక్టర్ సరోజ వివేక్ మాట్లాడుతూ విద్యార్థులు ఏ చిన్న అవకాశాన్ని కూడా వదులుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ విష్ణుప్రియ, లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేడుకగా ప్రతిభావంతులకు ఉగాది అవార్డ్స్ ప్రదానం

చిక్కడపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వంశీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి త్యాగరాయ గాన సభలో భిన్నరంగాలకు చెందిన 12 దేశాల నుంచి హాజరైన 53మంది ప్రతిభావంతులకు ఉగాది అవార్డ్ ప్రదానోత్సవం వేడుకగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపీ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగువారు తమవారి గొప్పతనం గుర్తించరన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో త్యాగాలు చేసిన వారు ఎక్కువగా తెలుగువారేనన్నారు. జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యను స్మరించుకునే వారే నేడు లేరన్నారు. వంశీ సంస్థ విదేశాలలో ఉన్న మహోన్నతులు అయిన వివిధ రంగాల ప్రముఖులు 53 మందిని సత్కరించి తెలుగు జాతి ప్రతిష్ఠ చాటారన్నారు. ప్రముఖ వైద్యుడు కాకర్ల సుబ్బారావు పేరిట కిమ్స్ డైరెక్టర్ బొల్లినేని కృష్ణయ్య ఏర్పర్చిన అవార్డును ప్రఖ్యాత న్యూరాలజిస్ట్ డా.మోహన్‌దాస్‌కు స్వర్ణపతకంతో, పింగళి వెంకయ్య అవార్డును పూర్వప్రధాని పీవీ నరసింహారావు సోదరుడు మనోహరరావుకు బహూకరించారు. డా.మోహన్‌దాస్ తమ స్పందన తెలిపుతూ నిమ్స్ అభివృద్ధిలో కాకర్ల సుబ్బారావు విజన్ మరువలేమన్నారు. వైద్య రంగంలో ఆయన చేసిన కృషి విశేషమన్నారు. ఆయన గురువు, మార్గదర్శి అని ఆయన పేరిట అవార్డ్ అందుకోవడం గర్వంగా ఉందన్నారు. తెలుగు యూనివర్సిటీ వీసీ ఆచార్య నిత్యానందరావు, దర్శకుడు రేలంగి నరసింహారావు, బొల్లినేని కృష్ణయ్య తదితరులు పాల్గొనగా వంశీ రామరాజు కార్యక్రమం నిర్వహించారు. రాధిక మంగినపూడి వ్యాఖ్యానం చేసిన కార్యక్రమంలో డా.తెన్నేటి సుధ, సుంకరపల్లి శైలజ తదితరులు పాల్గొన్నారు. అనఘాదత్త రామరాజు కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది.


ఉగాది అవార్డ్స్‌ను ప్రదానం చేస్తున్న బుద్ధప్రసాద్

'రాజీవ్ యువ వికాసం' గడువును పొడిగించాలి

నల్లకుంట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాస పథకం గడువును పొడిగించాలని నేషనల్ అంబేడ్కర్ సేన జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజీవ్ యువ వికాస పథకం కోసం ఎంతో మంది అభ్యర్థులు, నిరుద్యోగులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఈ పథకం గడువును పెంచాలని ఆయన కోరారు. శనివారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తు కోసం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మండల కార్యాలయాలకు వెళ్లిన ప్రతి రోజూ సర్వర్ డౌన్ వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర మంత్రి, కలెక్టర్ తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

బర్కత్‌పుర, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొని గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి పరిస్థితి విషమించి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాలప్రకారం... ఉప్పుగూడ-ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ల నడుమ ఈనెల 9న 35 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొట్టింది. ఆ వ్యక్తికి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

ముషీరాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్

ముషీరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని కాంగ్రెస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ ముషీరాబాద్ డివిజన్ కార్యాలయంలో జై బాపూ, జై భీమ్, జై సమిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెండం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ... బీజేపీ తమ స్వార్థ రాజకీయాల కోసం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేందుకు యత్నిస్తుందని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడానికి ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో కృషిచేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా డివిజన్ ఇన్‌చార్జిగా హాజరైన అల్లాఉద్దీన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి డి.వెంకటేష్, నగర కార్యదర్శి తమగొండ రాజ్‌దీప్, డివిజన్ మాజీ అధ్యక్షుడు చారి, మైనార్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు డాక్టర్ మినాజ్, బి-బ్లాక్ కమిటీ ఉపాధ్యక్షుడు రామకృష్ణ ముదిరాజ్, నాయకులు లింగంగుప్తా, గౌస్, రమేష్ గౌడ్, జయకుమార్, మురళీమోజేస్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ ముషీరాబాద్ ఇన్‌చార్జి అల్లా ఉద్దీన్‌ను సన్మానిస్తున్న పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర మాజీ కార్యదర్శి వెంకటేష్, రాజ్‌దీప్ తదితరులు

రక్తదానం.. ప్రాణదానం

చిక్కడపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణ దానం లాంటిదని తెలంగాణ గ్రంథాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాగంటి అయోధ్య అన్నారు. టీఎన్‌జీఓ సెంట్రల్ యూనియన్ వారు నిర్వహించిన రక్తదాన శిబిరంలో హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు సుఖేశ్‌కుమార్, శాగంటి అయోధ్య, వెంకటేష్‌యాదవ్, బొల్లం మహేందర్, హరిబాబు, వరప్రసాద్, జంగారెడ్డి, వెంకటేష్, రాజు తదితరులు రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన అయోధ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. సేకరించిన రక్తాన్ని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రికి అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో నేతలు మారం జగదీశ్వర్, ముజీబ్ పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిర్మూలనకు కమలాకర్ కృషి

చిక్కడపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మూఢనమ్మకాలను నిర్మూలించేందుకు కృషి చేసిన గొప్ప సైకాలజిస్ట్ హిప్నో కమలాకర్ అని మానసిక వైద్యనిపుణుడు డా.రవ్వ హరికుమార్ అన్నారు. కమలాకర్ జయంతి వేడుకల సందర్భంగా ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, నవభారత్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ కాలేజీ హాస్టల్‌లో అమ్మాయిలు మూఢనమ్మకాలు అంశంపై పోటీలు, అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హరికుమార్ మాట్లాడుతూ మానవ మనస్సు సరికొత్త ఆవిష్కరణలకూ విజ్ఞానానికి బీజమన్నారు. కానీ కొన్ని మూఢనమ్మకాలు ఈ ఎదుగుదలకు అడ్డుగా ఉంటున్నాయన్నారు. మూఢనమ్మకాలు తొలగించేందుకు తన జీవితాన్నే కమలాకర్ అంకితం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డా.హిప్నో పద్మాకమలాకర్, కృష్ణవేణి, రఘు, రమణ, జయశ్రీ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థికి కార్పొరేటర్ మద్దతు

చిక్కడపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీ హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతమ్‌రావుకు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం డివిజన్‌కు ఆయన వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఫ్లోర్‌లీడర్ శంకర్‌యాదవ్, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, రమేష్‌యాదవ్, నవీన్‌కుమార్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, సాయికుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలు అధ్యయనం చేయాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మహనీయుల జీవితచరిత్రను అధ్యయనం చేయాలని తద్వారా స్ఫూర్తి పొంది వారి జీవితాల నుంచి నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని రాష్ట్ర ఇన్‌కమ్‌ట్యాక్స్ ముఖ్య కార్యదర్శి గోపీనాథ్ అన్నారు. మహాత్మాజ్యోతిరావుపూలే జయంతి వేడుకలు ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని ఎస్ఆర్.శంకరన్ ఐఏఎస్ అకాడమీలో నిర్వాహకులు సతీష్ పర్యవేక్షణలో జరిగాయి. కమర్షియల్ ట్యాక్సెస్ మాజీ అదనపు కమిషనర్ వై.సత్యనారాయణ, వేణురావు, కుమారి వినీత, పత్తి రవి, ఫణికుమార్, హరీష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్ వ్యవసాయ విధానాలను ప్రతిఘటించాలి'

చిక్కడపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ అనుకూల వ్యవసాయ విధానాలను ప్రతిఘటించాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి తీగల సాగర్ పిలుపునిచ్చారు. అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆలిండియా కిసాన్‌సభ జెండాను సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి ఆవిష్కరించారు. సాగర్ మాట్లాడుతూ కేంద్రం వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాన్ని తిప్పికొట్టాలన్నారు. నాగయ్య, చంద్రారెడ్డి, ప్రసాదరావు, శోభన్, శివకుమార్, అంజనేయులు పాల్గొన్నారు.


రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ వెంకటేష్ చౌహాన్

గిరిజన శక్తి ఆధ్వర్యంలో 14న రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ

బర్కత్‌పుర, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈనెల 14న రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ చౌహాన్ తెలిపారు. శనివారం బర్కత్‌పురలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 14న సాయంత్రం 4 గంటలకు బషీర్‌బాగ్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి సచివాలయం పక్కన ఉన్న 125 అడుగుల డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ర్యాలీలో పాల్గొనే ప్రతి ఒక్కరూ సూటు, కోటు వేసుకుని రాజ్యాంగాన్ని చేతపట్టుకుని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల జేఏసీ నాయకులు రాజేష్ నాయక్, శ్రీమన్‌నాయక్, మహేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.